సాక్షి
విశాఖపట్నం

గురువారం । 9 । నవంబర్ । 2023



ఆకట్టుకున్న సైన్స్ పోటీలు

జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ప్రదర్శించిన వాటిలో ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. IIలో



క్రమశిక్షణతో ఆరోగ్య జీవనం

అమెరికాలోని ఇండియానా రాష్ట్రానికి చెందిన కార్మెల్ నగర మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్ విశాఖ నగరాన్ని సందర్శించారు. IIలో



టికెట్ తనిఖీల ఆదాయం రూ.2.50 కోట్లు IIలో

వాల్తేర్ డివిజన్‌కు టికెట్ల తనిఖీల రూపంలో రికార్డు స్థాయి ఆదాయం వచ్చింది.

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ బిభాస్ రంజన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిభాస్ రంజన్ దే బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికను, శేషవస్త్రాలను ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.

కనక మహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.38.20 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మీ దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించగా.. రూ.38,20,413 వచ్చింది. సెప్టెంబర్ 11 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయం, కానుకలు లెక్కించినట్లు ఈవో కె.శిరీష తెలిపారు. నగదుతో పాటు 116 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, కిలో 25 గ్రాముల వెండి, 134 అమెరికన్ డాలర్లు, 100 ఒమానీ రియాల్స్ వచ్చాయి. ధర్మకర్తల మండలి సభ్యులు సత్యరూపవాణి, ధనలత, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, దేవదాయ శాఖ తనిఖీదార్ వసంత కుమార్, శ్రీహరి సేవా సంఘం సభ్యులు, టౌన్ కొత్తరోడ్డు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఏవీఎస్ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్, జేసీ

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లలకు అధునాతన సాఫ్ట్‌వేర్‌తో తీర్చిదిద్దిన ట్యాబ్‌లను బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలు చదువుతో పాటు, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు ఇటువంటి సాంకేతిక పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకుని విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్, డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ అబ్దుల్ ఆషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : పాఠశాలల క్రీడా సమాఖ్య అంతర జిల్లాల అండర్–17 బ్యాడ్మింటన్ పోటీలు గురువారం నుంచి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల బాల బాలికల జట్లు పోటీపడనున్నాయి. బాలుర,బాలికల విభాగాల్లో సింగిల్స్‌తో పాటు డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ పోటీలను ప్రారంభించనుండగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారు. నగర మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎం.వి.వి.సత్యనారాయణ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నేడు

అగనంపూడి: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు గురువారం నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. బాలురు, బాలికల(అండర్–14, 17) విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఆర్టీసీ అలెర్ట్!

- విజయవాడ బస్సు ప్రమాదం నేపథ్యంలో చర్యలు
- 55 ఏళ్లు పైబడిన వారికి దగ్గర రూట్ల కేటాయింపు
- అద్దె/అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు రెండ్రోజులు శిక్షణ
- ప్రవర్తన, భద్రత పెంపుపై ప్రత్యేక తర్ఫీదు

సాక్షి, విశాఖపట్నం : విజయవాడ బస్టాండులో ఇటీవల జరిగిన బస్సు దుర్ఘటన నేపథ్యంలో ఆర్టీసీ అప్రమత్తమైంది. మళ్లీ అలాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా తగిన చర్యలు తీసుకుంటోంది. 55 ఏళ్లు పైబడిన, అనారోగ్య సమస్యలున్న డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసులకు పంపకూడదని ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దూర ప్రాంతాలు వెళ్లే సర్వీసుల్లో ఎక్కువగా రాత్రి విధులు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందన్న భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇలాంటి వారిలో ఆరోగ్యంగా ఉన్న వారి నుంచి అంగీకారం తీసుకుని పగటి పూట నడిచే దగ్గర రూటు ఎక్స్‌ప్రెస్ బస్సులకు, సిటీ బస్సులకు కేటాయిస్తారు. వారి స్థానంలో 55 సంవత్సరాల లోపు వయసు, ఆరోగ్యంతో ఉన్న డ్రైవర్లను, యువ డ్రైవర్లను పంపనున్నారు. ఇలా విశాఖపట్నం డిపో పరిధిలో 55 ఏళ్లు పైబడిన డ్రైవర్లు 30 మంది వరకు ఉన్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న డ్రైవర్లను అత్యవసర సమయాల్లో దూర ప్రాంత సర్వీసులకు పంపేవారు. కానీ ఇప్పుడు అలాంటి వారిని సర్వీసులకు పంపడం లేదు. సాధారణంగా సీనియర్ డ్రైవర్లు దూర ప్రాంత సర్వీసులకే తప్ప దగ్గర రూటు/సిటీ బస్సుల్లో విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపరు. అయితే విజయవాడ బస్సు ప్రమాదంతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నారు.

ఆ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ

సాధారణంగా బస్సు చిన్నపాటి ప్రమాదానికి గురైనా సంబంధిత బస్సు డ్రైవర్‌కు ఆర్టీసీలో శిక్షణకు పంపిస్తుంటారు. విజయవాడ బస్సు ప్రమాదం నేపథ్యంలో అవుట్‌సోర్సింగ్, అద్దె బస్సుల డ్రైవర్లకు రెండు రోజుల పాటు విజయనగరంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. వారం రోజుల్లో ఈ శిక్షణను ప్రారంభించనున్నారు. ఇందులో ఒక పూట థియరీ, మరో పూట నిపుణుల సమక్షంలో డ్రైవింగ్ పరిశీలన ఉంటుంది. ప్రమాదాల నివారణపై మెళకువలను నేర్పిస్తారు. విశాఖ జిల్లాలో 260 మంది అద్దె బస్సు డ్రైవర్లు, 140 మంది వరకు అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లు ఉన్నారు. వీరందరికీ దశల వారీగా విజయనగరంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే ప్రయాణికుల పట్ల ఆర్టీసీ డ్రైవర్ల ప్రవర్తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాంటి వారు సత్ప్రవర్తనతో మెలిగేలా నిపుణులు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.



ద్వారకా బస్ స్టేషన్ పోర్టికో ప్రాంతం

డీబీఎస్‌లో కాంక్రీట్ స్టాపర్లు

విజయవాడలో బస్సు అదుపు తప్పి ప్లాట్‌ఫాం పైకి దూసుకెళ్లిన దుర్ఘటనలో ముగ్గురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. దీంతో అటువంటి ప్రమాదాలకు తావులేకుండా విశాఖ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదివరకే ద్వారకా బస్‌స్టేషన్ (డీబీఎస్)లో ప్లాట్‌ఫాంల వద్ద కాంక్రీట్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఏదైనా బస్సు అదుపు తప్పి దూసుకొస్తే ప్లాట్‌ఫాంపైకి వెళ్లకుండా ఈ స్టాపర్లు అడ్డుకుంటాయి. ఇప్పుడు తాజాగా డీబీఎస్ పోర్టికో ప్రాంతంలోనూ కాంక్రీట్ స్టాపర్లను ఏర్పాటు చేయనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

పర్యాటకానికి 'హరిత'హారం

- హరితా హోటల్ యాత్రినివాస్ ఆధునికీకరణ
- రూ.5.08 కోట్లతో పనులకు ఏపీటీడీసీ శ్రీకారం

సాక్షి, విశాఖపట్నం : అందాల విశాఖ జిల్లా.. పర్యాటక రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రకృతి రమణీయతతో దేశ విదేశీ సందర్శకులకు స్వర్గధామంగా మారింది. ఏటా విశాఖకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. కొత్త పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డులో ఉన్న హరిత హోటల్ యాత్రీనివాస్ భవనాన్ని రూ.5.10 కోట్లతో ఆధునికీకరించాలని నిర్ణయించింది. హరిత హోటల్‌లో ఎక్కువగా పశ్చిమబెంగాల్, ఒడిశాతో పాటు ఉత్తర భారతదేశానికి చెందిన పర్యాటకులు బస చేస్తుంటారు. టూరిజం ప్యాకేజీలో వచ్చే టూరిస్టులకు హరిత హోటల్ డెస్టినీగా ఉంది. అందుకే అత్యాధునిక సౌకర్యాలతో యాత్రినివాస్‌ని సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

స్పెషల్ ఎట్రాక్షన్‌గా పార్టీ జోన్

అప్పుఘర్‌లో బీచ్ వ్యూలో హరితా హోటల్ యాత్రి నివాస్ ఉంది. మొత్తం 4 అంతస్తుల భవనంలో 46 గదులు, రెస్టారెంట్ ఉంది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో గదుల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల పెచ్చులూడుతున్నాయి. భవిష్యత్తులో పర్యాటకుల తాకిడి మరింత పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో యాత్రి నివాస్‌ను సుందరీకరించేందుకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) టెండర్లు ఆహ్వానించింది. రూ.5.08 కోట్లకు ఏపీ కన్‌స్ట్రక్షన్ అండ్ కో సంస్థ ఈ పనుల టెండర్లను దక్కించుకుంది. నాలుగు నెలల్లోగా పనులు పూర్తి చేసి అందించేందుకు అగ్రిమెంట్ కూడా కుదుర్చుకుంది. సుందరీకరణలో భాగంగా ముందు భాగంలో ఉన్న బాల్కనీని కుదించి.. గదుల విస్తీర్ణం పెంచనున్నారు. లాంజ్‌ని పెంచి.. వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయనున్నారు. కొత్త లిఫ్టులు రానున్నాయి. టెర్రస్‌పై స్పెషల్ అట్రాక్షన్‌గా కొత్తగా పార్టీ జోన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులను నాలుగు నెలల్లో పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీటీడీసీ ఇంజినీరింగ్ అధికారి రమణప్రసాద్ తెలిపారు. బీచ్‌రోడ్డులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా హరిత హోటల్ భవన సుందరీకరణ పనులు డిజైన్ చేశామని వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని రమణప్రసాద్ వివరించారు.



పర్యాటక శాఖకు చెందిన హరిత నివాస్

చేసిన మంచిని ప్రజలకు చెబుదాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు. చిత్రంలో ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే నాగిరెడ్డి, సమన్వయకర్త కె.కె రాజు

- నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

కొమ్మాది: జిల్లాలో గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తెలిపారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం సమపాళ్లలో జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు ఏం చేశాయి.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించడమే 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై ఆర్‌బీఐ ఇచ్చిన నివేదిక చూస్తే పచ్చ నేతలకు అర్థమవుతుందన్నారు. జీడీపీలో గత ప్రభుత్వంలో రాష్ట్రం 18వ స్థానంలో ఉంటే.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 9వ స్థానంలోకి ఎగబాకిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు 4 లక్షల పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందన్నారు. పరిశ్రమల అభివృద్ధి పరంగా 2019లో రాష్ట్రం 22వ స్థానంలో ఉంటే.. వైఎస్సార్ సీపీ వచ్చిన తర్వాత 3వ స్థానంలోకి చేరిందన్నారు. మైక్రోసాఫ్ట్, టీసీఎస్, అదానీ వంటి కంపెనీలు ఆంధ్రాలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామని, ప్రతి పాఠశాలలోనూ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. సుమారు 5 లక్షలకు పైగా బైజూస్ ట్యాబ్‌లు అందించామని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు కార్పొరేట్ వైద్యం చేరువ చేశామన్నారు. 17 మెడికల్ కళాశాలలు, రెండు విమానాశ్రయాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కరోనా వ్యాక్సినేషన్‌లో మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంలోనూ దేశంలో రాష్ట్రం మొదటిస్థానంలో ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ఇది చూసి ఓర్వలేని పచ్చమీడియా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని చెబుదామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నియోజకవర్గ పరిశీలకులు మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జి రవిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు పేర్ల విజయచందర్, పిల్లా సుజాత, మాధవీవర్మ, ముఖ్య నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదు

- ఉక్కు ఉద్యమానికి 1000 రోజులు
- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- కార్మికుల పోరాటానికి సలామ్: నాగిరెడ్డి



శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉక్కు ఉద్యమం బుధవారం నాటికి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద భారీ నిరసన చేపట్టి, అన్ని సంఘాల నాయకులతో కలిసి సభ నిర్వహించారు. వీరికి మద్దతుగా విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు, ప్రజాసంఘాల ప్రతినిధులు కుటుంబ సభ్యులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ 26 వేల ఎకరాల భూములిచ్చి.. 32 మంది పోరాట యోధుల ప్రాణ త్యాగాలు చేస్తే ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లో కాపాడుకుంటామన్నారు. ప్రైవేటీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉక్కు పరిశ్రమ కోసం పోరాటం సాగిస్తున్న కార్మికుల స్ఫూర్తికి సలామ్ కొట్టారు. ప్రజాశాంతి అధ్యక్షుడు కె.ఎ.పాల్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని, ప్లాంట్‌ను కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ కొమ్ముకాస్తున్నారని.. ఇందుల్లో భాగంగానే ప్లాంట్‌ను నష్టాల్లో నడిపించి, ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో కూర్మన్నపాలెం కూడలిలో కార్మికులు హైవేపై బైఠాయించి నినాదాలు చేయడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. పోలీసులు అక్కడకి చేరు కుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కొప్పో లు పరంధామయ్య రచించిన 'విశాఖ ఉక్కు పడిలేచిన కెరటం –ఒక సామాజిక పునర్జీవం'అనే పుస్తకాన్ని ప్రొఫెసర్లు బాలమోహన్‌దాస్, జె.వి.ప్రభాకర్, లజపతిరాయ్, సీపీఎం రాష్ట్ర నాయకుడు నరసింగరావు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ రఘువర్మ, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, కోమటి శ్రీనివాసరావు, వేణు బాబు, పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కారు రమణ, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, జె.రామకృష్ణ, బొడ్డు పైడిరాజు, విల్లా రామ్మోహనకుమార్, వరసాల శ్రీనివాసరావు, వై.మస్తానప్ప, పిట్టారెడ్డి, గుమ్మడి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మానవహారం



ర్యాలీగా వస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేస్తున్న పోరాటానికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం నగరంలో వామపక్ష పార్టీలు, అఖిల పక్ష కార్మిక, ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ విగ్రహం వద్ద కార్మికులు మానవహారం చేశారు. ఈ సందర్భంగా సిటు జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, కార్పొరేటర్ గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ జయప్రదమైందన్నారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో 72 గంటలపాటు మహాధర్నా చేపడుతున్నట్టు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అచ్యుతరావు, ప్రజాపోరు నాయకులు దేవా, కె.శంకరరావు, పి.లక్ష్మి, తిరుపతిరావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్ సీఎస్సార్ బ్లాక్‌లో నిరంతర వెలుగుల కోసం ఏర్పాటు చేసిన నూతన సోలార్ పవర్ ప్లాంట్‌ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యసేవలతో పాటు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. దీనిలో భాగంగానే ఆర్సెలార్ మిట్టల్ సంస్థ సీఎస్సార్ నిధులు రూ.50 లక్షలతో 120 కేవీ సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్సెలార్ మిట్టల్ సంస్థ సౌజన్యంతో విక్టోరియా ఆస్పత్రిలో త్వరలో రూ.50 లక్షలతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, మరో రూ.50లక్షల నిధులతో చిన్నపిల్లల వసతి గృహాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా విభాగంలోని వైద్యులకు అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ సహకారంతో కేజీహెచ్‌లోని వివిధ వార్డుల్లో రూ. 50 వేలు విలువ గల శాశ్వత బెంచీలను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ప్రారంభించారు.

కార్యక్రమంలో కేజీహెచ్ సూపరిండెంటెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ పద్మజ, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ, ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ఈడీ ఎం.రవీంద్రనాథ్, హెచ్ఆర్ డి.ఎస్.వర్మ, ఈడీ శ్రీనివాస్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మహేష్, లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, అధికారులు

నగరంలో భద్రత కట్టుదిట్టం

పోలీస్ కమిషనర్ రవిశంకర్



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

దొండపర్తి: సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచిన ప్రాంతాల పరిధి మరింత పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌ను బుధవారం సీపీ సందర్శించారు. కంట్రోల్ రూమ్ నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. ముఖ్యంగా డయల్ 112కు వస్తున్న కాల్స్ తీసుకొని వాటిని సంబంధిత స్టేషన్లు, అధికారులకు ఎంత సమయంలో తెలియజేసి సమస్యను పరిష్కరిస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు. ఆ కాల్స్ రికార్డును భద్రపరుస్తున్న విధానంలో పలు సూచనలు చేశారు. పోలీస్ వాట్సాప్ నంబర్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటిని డిస్పోజ్ చేస్తున్న తీరును గమనించారు. కంట్రోల్ రూమ్ నుంచి సెట్ల ద్వారా అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలకు ఎంత స్పష్టంగా సమాచారం చేరుతోందన్న విషయాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి బ్లూకోట్స్, నైట్ రౌండ్, రోడ్ సేఫ్టీ, ఇతర పోలీసు మొబైల్స్ ఏయే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నాయో జీపీఎస్ ద్వారా గమనిస్తున్న విధానం తెలుసుకుని పలు సూచనలు చేశారు. దిశ ఎస్ఓఎస్ పనిచేస్తున్న తీరును గమనించారు. కంట్రోల్ రూమ్‌లో ఉన్న సిబ్బంది విభాగాల వారీగా నిర్వహిస్తున్న విధులు తెలుసుకుని, వారి విద్యార్హతలు, పనితీరు పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నగర పరిధిలోని ముఖ్య కూడళ్లలో ఉన్న సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచి నగర భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

ఇద్దరికి ప్రాణదానం.. ఒకరికి చూపు

- తుంగ్లాంకు చెందిన మహిళ బ్రెయిన్‌డెడ్
- అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు


లక్ష్మి(ఫైల్)

మహారాణిపేట : ఒక మహిళ తాను చనిపోతూ మరో ఇద్దరికి ప్రాణదానం చేయడంతో పాటు ఒకరికి చూపు కల్పించింది. ఈనెల 4వ తేదీన తుంగ్లాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పారుపల్లి లక్ష్మి (58) తలకు తీవ్ర గాయమైంది. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందించారు. అక్కడి నుంచి రామ్‌నగర్ కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేసినప్పటికీ ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఎవరికైనా ఉపయోగపడాలన్న ఆలోచనతో లక్ష్మి అవయవాలు దానం చేసేందుకు జీవన్‌దాన్‌కు దరఖాస్తు చేసినట్లు లక్ష్మి కుమారుడు పి.సతీష్ తెలిపారు. అక్కడి నుంచి అనుమతి రావడంతో కేర్ ఆస్పత్రికి లివర్, అపోలో ఆస్పత్రికి కిడ్నీ, ఐ బ్యాంక్‌కు కళ్లు దానం చేసినట్లు తెలిపారు. బుధవారం తుంగ్లాంలో ఆమె అంత్యక్రియలు జరిగాయి.

ఆకర్షణీయ నగరం.. విశాఖ

- కార్మెల్ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్

బీచ్ రోడ్డు: విశాఖ అందర్నీ ఆకట్టుకునే ఆకర్షణీయ నగరమని, ఇతర దేశాలకు ఆదర్శంగా ఉందని అమెరికాలోని ఇండియానా రాష్ట్రానికి చెందిన కార్మెల్ నగర మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్ కితాబునిచ్చారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద బుధవారం 'స్వచ్ఛత ఎకో అవార్డుల ప్రారంభోత్సవం', 'స్వచ్ఛ దీపావళి సిగ్నేచర్ క్యాంపైన్' నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి జేమ్స్ స్వచ్ఛత ఎకో–వైజాగ్ అవార్డు లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం ప్రకృతి పరంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంద


మాట్లాడుతున్న కార్మెల్ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్

న్నారు. జీవీఎంసీ అమలు చేస్తున్న స్వచ్ఛత ఎకో వైజాగ్ కార్యక్రమాలతో విశాఖకు ప్రపంచ స్థాయిలో కూడా గుర్తింపు వస్తోందన్నారు. మేయర్ గొలగాని మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో ఆరోగ్యవంతమైన పోటీతత్వాన్ని పెంపొందించి స్వచ్ఛ వార్డులుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీస్ ద్వారా సర్వే నిర్వహించిన అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వార్డులకు వరసగా రూ.20 లక్షలు, రూ.10 లక్షలు, రూ.5 లక్షలు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మార్గదర్శకాల ప్రకారం కాలుష్య రహితంగా, ప్లాస్టిక్ రహితంగా, పర్యావరణ హితమైన వస్తువులతో హరిత దీపావళిని జరుపుకోవాలన్నారు. స్వచ్ఛ దీపావళి–శుభ దీపావళి సెల్ఫీ బూత్‌లో ఫొటో తీసుకుని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు పెద్దింటి ఉషశ్రీ, రెయ్యి వెంకటరమణ, బిపిన్ కుమార్ జైన్, భీశెట్టి వసంత, జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సాక్షి, అనకాపల్లి: పరవాడ సంతలో ఆర్మీ ఉద్యోగితో ఘర్షణ సందర్భంగా అనుచితంగా ప్రవర్తించిన నలుగురు పరవాడ పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఏఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ బుధవారం వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆర్మీ ఉద్యోగి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు చింతిస్తున్నామని తెలియజేస్తూ.. అందుకు బాధ్యులైన పోలీస్ సిబ్బందిపై కఠిన చర్య తీసుకున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి రెండో విడత కౌన్సెలింగ్‌కు సన్నాహాలు

మహారాణిపేట: స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి త్వరలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విజయనగరం మెడికల్ కళాశాలలో 80 పోస్టులు, వైద్య విధాన పరిషత్‌లో ఆరు పోస్టుల భర్తీకి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి.. 60 మందికి పోస్టింగ్ ఇచ్చారు. ఏడు పోస్టుల్లో కోవిడ్ వెయిటేజ్ మార్కుల స్పష్టత కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత లేఖ రాశారు. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా.. తుది జాబితాలో ఎంపికైన 11 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. ఐదుగురు పోస్టింగ్ వద్దని లేఖ ఇచ్చినట్లు ఆర్డీ డాక్టర్ సుజాత తెలిపారు. పోస్టింగ్ ఇచ్చిన 60 మందిలో ఎంత మంది విధుల్లో చేరుతారో తెలియని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఖాళీలన్నీ క్రోడీకరించి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

టౌన్ ప్లానింగ్‌పై అవినీతి ఆరోపణలు

- విచారణను వేగవంతం చేసిన ఏసీబీ
- సచివాలయం సిబ్బందినీ విచారించిన అధికారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 8వ జోనల్ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఏసీబీ అధికారులు విచారించారు. టౌన్ ప్లానింగ్ విభాగం, నిర్మాణ పనులు పర్యవేక్షించే పలువురు సచివాలయ సిబ్బందిని బుధవారం నగరంలోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి పిలిచి వివరాలు సేకరించారు. అలాగే కొంత మంది ఇళ్ల నిర్మాణదారులను కూడా విచారించారు. వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం, కాకానినగర్‌లో ఇటీవల కాలంలో చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణం, అనుమతుల జారీలో చోటుచేసుకున్న పరిణామాలపై వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో నాలుగు రోజుల కిందట వేపగుంటలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేసి, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల 90వ వార్డులోని బుచ్చిరాజుపాలెం, కాకానినగర్‌లో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించి, అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలను తొలగించారు. ఫిర్యాదులు వచ్చిన తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించడంతో తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. భవన నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు సచివాలయ సిబ్బంది వీటిపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ విషయంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో 90వ వార్డుకు చెందిన సచివాలయం సిబ్బందిని ఏసీబీ అధికారులు విచారించారు. ఇంకా ఎవరిరెవరికి ఏసీబీ నుంచి పిలుపు వస్తుందోనని సర్వత్రా చర్చసాగుతోంది.

క్రమశిక్షణతో ఆరోగ్య జీవనం


విశాఖ అందాలను తన సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న జేమ్స్ బ్రెయినార్డ్

దాబాగార్డెన్స్: కార్మెల్ నగర మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్ బుధవారం విశాఖ నగరాన్ని సందర్శించారు. కార్మెల్ సిటీ, విశాఖ నగరం సిస్టర్ సిటీస్ అయిన నేపథ్యంలో ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వి. సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మతో కలిసి నగరంలో పర్యటించారు. ముందుగా వైజాగ్ పటం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సంస్థ చరిత్రను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యక్షుడు ఎం.సుదర్శన్ స్వామి మేయర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జేమ్స్ బ్రెయినార్డ్ మాట్లాడుతూ లక్ష జనాభా కల్గిన కార్మెల్ సిటీలో 10 శాతం భారతీయులే నివసిస్తున్నారని తెలిపారు. తమ ప్రజలు పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యకరమైన జీవనం గడుపుతున్నారని వెల్లడించారు. నడక, సైకిల్ మార్గాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తారని తెలిపారు. సమావేశం అనంతరం కైలాసగిరిని ఆయన సందర్శించారు. అక్కడ వ్యూ పాయింట్లు, తెలుగు మ్యూజియం వద్ద సెల్ఫీలు దిగారు. మ్యూజియంలో దేశ చరిత్రను వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర ఆయనకు చూపించారు. ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనా, కుర్సురా సబ్‌మెరైన్ మ్యూజియంను మేయర్ సందర్శించారు. నగర రోడ్లు గ్రీనరీతో ఎంతో అద్భుతంగా ఉన్నాయని వర్ణిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యనిర్వాహక ఇంజినీర్ బలరామరాజు, యూఎన్‌డీపీ కో–ఆర్డినేటర్ ఎస్ఎస్ రాజామణి, ప్రోగ్రామ్ మేనేజర్ రవి కుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 11న ఆర్కే బీచ్‌లో దీపోత్సవం

ఎంవీపీకాలనీ: ఆర్.కె.బీచ్ వేదికగా డిసెంబర్ 11న కార్తీక మహా దీపోత్సవం జరగనుంది. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల నుంచి అనుమతులు లభించినట్లు విశాఖ కార్తీక దీపోత్సవం కమిటీ వెల్లడించింది. టీటీడీ రాష్ట్ర వ్యాప్తంగా తిరుపతి, కర్నూల్, విశాఖలో ఈ ఏడాది కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా డిసెంబర్ 11న విశాఖలోని ఆర్.కె.బీచ్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది.

దివ్యాంగులకు ప్రత్యేక జాబ్ మేళా రేపు

మధురవాడ: జిల్లా ఉపాధి కార్యాలయం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ సంస్థ సహకారంతో ఈ నెల 10న దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి. మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు 10 గంటలకు లంకపల్లి బుల్లయ్య కాలేజీలో జరిగే మేళాలో అమెజాన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ట్రాన్స్‌ఫోర్మేషన్ క్వాలిటీ స్పెషలిస్ట్(సాఫ్ట్‌వేర్) ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి.. ఎంఎస్ ఆఫీస్ సర్టిఫికెట్, ఇంగ్లిష్ నైపుణ్యాలు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs. gov. in/లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడు ప్రాజెక్టుల ఎంపిక


సైన్స్ ప్రాజెక్టు విశేషాలను వివరిస్తున్న విద్యార్థులు

గాజువాక : జిల్లా విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ప్రదర్శనకు ఉంచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్‌కాంగ్రెస్–2023 జిల్లా స్థాయి పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 273 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటి నుంచి ఎంపిక చేసిన ఏడు ప్రాజెక్టులను ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నట్లు జిల్లా స్థాయి పోటీల నిర్వాహకులు తెలిపారు.

సృజనకు వేదిక

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు మంచి వేదిక అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం అలవడుతుందన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఎంఈవో జి.సునీత, ఆప్‌కాస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.రాజారావు, 67వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, గాజువాక హైస్కూల్ జిల్లా ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మీభాయి, ఆప్‌కాస్ట్ అకడమిక్ సమన్వయకర్త బి.ఎస్.మూర్తి, సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ మల్లికార్జునకు కృతజ్ఞతలు

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుపై హర్షం


కలెక్టర్ మల్లికార్జునను సత్కరిస్తున్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో సహకరించిన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు విశాఖ అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సహకారాన్ని భవిష్యత్తులోనూ అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ గౌరవాధ్యక్షుడు కె.జి.రాఘవేంద్రరెడ్డి, అధ్యక్షుడు బి.రవికాంత్ మాట్లాడుతూ విశాఖ అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు విలువైన సలహాలు, సూచనలతో లక్ష్య సాధనకు దిశా నిర్దేశం చేస్తూ సహకరించిన కలెక్టర్ మల్లికార్జునకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డుల జారీలో పారదర్శకంగా వ్యవహరించారని, ఇప్పుడు ఇళ్ల స్థలాల కేటాయింపులో కీలక భూమిక పోషించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ వచ్చిన వెంటనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు అంశాన్ని వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు జి.జనార్దనరావు, ఉపాధ్యక్షులు డి.మురళీకృష్ణారెడ్డి, కొయిలాడ పరశురాం, పి.రామకృష్ణ, సొసైటీ గౌరవ సలహాదారులు పి.సత్యనారాయణ, ధవళేశ్వరం రవికుమార్, సహాయ కార్యదర్శులు ఎం.చిట్టిబాబు, అనురాధ, బందరు శివప్రసాద్, కోశాధికారి ఆలపాటి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

టికెట్ తనిఖీల ఆదాయం రూ.2.5 కోట్లు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌కు అక్టోబరులో టికెట్ల తనిఖీల రూపంలో రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో 49,966 కేసులు నమోదు చేసి, రూ.2.50 కోట్ల అపరాధ రుసుంగా వసూలు చేసినట్లు వెల్లడించారు. టికెట్ లేకుండా, అనధికారికంగా, సరైన టికెట్ లేకుండా రిజర్వుడ్ బోగీల్లో ప్రయాణించే వారిపై ఈ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వాల్తేర్ డివిజన్‌కు అక్టోబర్‌లో 2.15 కోట్లు లక్ష్యం ఇవ్వగా.. 14 శాతం అధికంగా 2.5 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఇది గతేడాది కంటే 9.6 శాతం ఎక్కువ అని వివరించారు. ఈ సందర్భంగా కమర్షియల్ సిబ్బందిని అభినందిస్తూ.. సరైన టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించవద్దని ప్రయాణికులకు సూచించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం


విశాఖ రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న 18 కేజీల గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్ఆర్పీ) బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్ ఫారాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సతీష్(30) బ్యాగును తనిఖీ చేయగా.. సుమారు 18 కేజీల గంజాయి బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌కు రైలులో ఈ గంజాయిని తీసుకెళ్తున్నట్లు నిందితుడు విచారణలో తెలియజేశాడు. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	రూ.102
స్కిన్	రూ.174
స్కిన్‌లెస్	రూ.184

పందలపాక బెటాలియన్‌కు బెస్ట్ నాన్ బోర్డర్ అవార్డు


డీజీ అనీష్ దయాల్ సింగ్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న కమాండెంట్ ధర్మేంద్ర కుమార్

ఆనందపురం: పందలపాకలోని 56వ ఐటీబీపీ బెటాలియన్.. బెస్ట్ నాన్ బోర్డర్ బెటాలియన్ ట్రోఫీ సాధించింది. డెహ్రాడూన్‌లోని 23వ బెటాలియన్‌లో బుధవారం 62వ రైజింగ్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ అనీష్ దయాల్ సింగ్ చేతులమీదుగా బెస్ట్ అవార్డును అందుకున్నట్లు 56వ ఐటీబీపీ బెటాలియన్ కమాండెంట్ ధర్మేంద్ర కుమార్ భటేరియా తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ బెటాలియన్ సిబ్బంది నగరంలోని ప్రధాన కార్యాలయంతో పాటు మంగళూరులోని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్‌కు భద్రత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే చత్తీస్‌గఢ్‌లో తీవ్రవాద కార్యకలాపాలు నిరోధక చర్యలతో పాటు కాలానుగుణంగా ఇతర అంతర్గత భద్రత విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. తమ బెటాలియన్ 2020లో ఉత్తమ నాన్ బోర్డర్ బెటాలియన్ అవార్డు, 2021లో ఉత్తమ స్వచ్ఛ బెటాలియన్ ట్రోఫీని అందుకున్నట్లు వివరించారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

- ఏసీబీ సీఐ సతీష్ కుమార్
- డీఈవో కార్యాలయంలో అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సీఐ సతీష్ కుమార్

విశాఖ విద్య: అవినీతికి పాల్పడే అధికారులు, ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవని విశాఖపట్నం ఏసీబీ సీఐ సతీష్ కుమార్ అన్నారు. అవినీతి నిర్మూలనపై జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈవో కార్యాలయం, విశాఖ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు విధి నిర్వహణలో సేవాభావంతో పనిచేసి, అందరి మన్ననలు పొందాలన్నారు. అవినీతికి పాల్పడినా, ఇందుకు ప్రేరేపించినా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులు, ఉద్యోగులపై కఠిన శిక్షలు ఉంటాయనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. అవినీతి కేసులు ఎదుర్కొంటే సర్వీసుపరంగా ఎంతో నష్టపోతారని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఏసీబీ ఎస్ఐ మనోజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు లక్ష్మణరావు, అరుణ జ్యోతి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీ మోహన్, తహసీల్దార్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.